# శ్రీవారికి ప్రేమలేఖ

నిశ్చల సిద్ధారెడ్డి

ప్రియమైన శ్రీవారికి,

మీరీ ఉత్తరం చదివేపాటికి నేనెక్కడుంటానో నాకే తెలీదు. గమ్యం తెలీని బాటసారిని. ఉత్తరం చూసేలోపు నాకోసం మీరు, మీ అమ్మానాన్నలు వెదుక్కునే వుంటారు. నాకు తెల్సు.


మీతో గడిపిన ఈ రెండు సంవత్సరాల కాలం గురించి తల్చుకుంటేనే ఎంతో జుగుప్సాకరమైన అనుభూతి కలుగుతోంది. ఎన్నెన్నో కమ్మని కలలతో మీ జీవితంలోకి ప్రవేశించాను. పెళ్లినాటి ప్రమాణాలన్నీ నిజాలేనని మురిసిపోయాను.

అందమైన మీ రూపం చూసి మురిసి ముక్కలైనాను. పెళ్లిలో మిమ్మల్ని చూసిన అందరూ 'అమ్మడూ! మీ ఆయన అచ్చు శ్రీరామచంద్రుడల్లే ఉన్నాడే' అని మిమ్మల్ని పొగుడుతుంటే నన్నే పొగిడినంత సంబరపడిపోయాను. కానీ...కానీ...మీ అందమైన రూపం వెనుక ఇంత కుత్సితమైన, కల్మషమైన, అందవిహీనమైన, అసహ్యమైన మెంటాలిటీ వుంటుందని ఊహించలేకపోయాను.

పెళ్లిముందు మగాడంటే కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలు ఏర్పరచుకున్నాను. మగాడంటే ఇలా ఉండాలి అని ఫ్రేమ్ చేసుకున్నాను. మగాడంటే డీసెంట్‌గా, డిగ్నిఫైడ్‌గా ఉండాలని, శారీరక సౌందర్యం కంటే మానసిక సౌందర్యం ముఖ్యమని...ఏవేవో పిచ్చి కలలు కనేదాన్ని.

పెళ్లిచూపులనాడు కోరికోరి నన్ను చేసుకుంటున్నారంటే పట్టలేనంత ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాను. అందరూ నా అదృష్టాన్ని పొగుడుతుంటే సంబరపడిపోయాను. నా తోటి స్నేహితులు ఇంత అందమైన, ఆస్తిపరుడైన మొగుడ్ని పొందుతున్న నా అదృష్టాన్ని చూసి జెలసీ ఫీలవుతుంటే గర్వంగా ఫీలయ్యాను. కానీ పాపం వారికేం తెల్సు మీదెంత అసహ్యకరమైన మెంటాలిటీనో.

కాపురానికి వచ్చిన మొదటి రోజు నుండి మీ లేకి బుద్ధులు, పిసినారి చేష్టలు, శాడిస్టిక్ ఆలోచనలు చూసి నివ్వెరపోయాను. భారతీయ స్త్రీగా, సాంప్రదాయవాదిగా సర్దుకుపోవడానికే ప్రయత్నించాను. సర్దుకు పోయాను కూడా. కానీ నన్నెంత అవమానపరచాలో అంతా



అవమానపరిచారు మీరు, మీ అమ్మానాన్నలు, చెల్లెలు.

పెళ్లయి పదేళ్లయినా పుట్టింట్లోనే గాదె క్రింద పందికొక్కులా మేస్తూ భర్తను ఒక పామేరియన్ పెంపుడు కుక్కకంటే హీనంగా చూసే మీ చెల్లెలు, మీరేం చేస్తే అదే చేస్తూ నామీద ఆంక్షలు విధిస్తూ పేర్లు పెడుతూ నేను చేసే ప్రతి పనికి వంకలు పెడుతూ, పెళ్లిలో కట్నం చాల్లేదనీ, ఆడపడుచు లాంఛనాలు చాల్లేదనీ, పెళ్లిలో ఆ మర్యాద జరగలేదు, ఈ మర్యాద జరగలేదంటూ నన్ను అందరి ముందు దెప్పుతూ క్షణక్షణం అవమానిస్తూ మనిద్దరి మధ్య అగాధం సృష్టిస్తున్నా సహిస్తూనే వచ్చాను. ఎందుకు? మీ కోసం, మీ ప్రేమ కోసం.

మీ అమ్మానాన్నల ధనదాహాన్ని, కట్నం కోసం వేధింపుల్ని, సూటిపోటి మాటల్ని అన్నింటినీ...అన్నింటినీ మీ కోసం భరించాను. క్రమంగా తెల్సుకుని మార్తారని ఆశించాను. కానీ జరిగిందేమిటి? రోజురోజుకు వాళ్ల మాటల్ని బాగా జీర్ణించుకుని మీ శాడిస్టిక్ ధోరణుల్ని అధికం చేసుకుని నన్ను వేధించసాగారు. నేను ఏడిస్తే మీరు పగలబడి నవ్వే స్టేజికి వచ్చారు.


అసలు నాకు తెలీక డుగుతాను పెళ్లి మాటల్లో చెప్పి నవన్నీ నా తల్లిదండ్రులు మీకప్పగించేసారు. అడిగిన దానికంటే ఎక్కువ కట్నాన్నే మీకు ముట్టచెప్పారు. కానీ ఇదేంటి?

నేను కోరుకుందేమిటి? మీ ప్రేమను, మీ అభిమానాన్ని, మీ ఆదరణను. మన పెళ్లయిన దగ్గర్నుండి మీరు నన్నొక్కసారైనా ప్రేమగా దగ్గరకు తీసుకున్నారా? ఆత్మవిమర్శ చేసుకోండి. అయినా మీకు ఆత్మనేది ఒకటుందా అని నా డౌట్. ఎప్పుడూ మీ డబ్బు లెక్కలు, కట్నంలో హెచ్చుతగ్గులు, మర్యాదల్లో లోపాలు, లాంఛనాల్లో

**మొదటి రాత్రి గదిలోకి ఎన్నెన్నో కలలతో అడుగుపెట్టిన నన్ను కనీసం తాకనున్నా తాకకుండా "మా చెల్లి నీకన్నా అందంగా వుంటుంది. ఆమె దేవత. ఆమె చెప్పింది కాబట్టే నేన్నిన్ను పెళ్లి చేసుకున్నానని" మీరని అటు తిరిగి గుర్రుపెట్టి నిద్రపోతుంటే నవ్వాలో, ఏడ్వాలో తెలీక రాత్రంతా ఆలోచనలతో గడిపిన నా మనసుకు తెలుసు నేనెంత వేదనను అనుభవించానో.**

కొరతలు, మా పుట్టింటి నుండి పెళ్లిమాటల్లో మాట్లాడని ఆస్తి ఏమన్నా కలిసొస్తుందా అని ఆరాలు... ఇదేకదా మీ వరుస.

మొదటి రాత్రి గదిలోకి ఎన్నెన్నో కలలతో అడుగుపెట్టిన నన్ను కనీసం తాకనన్నా తాకకుండా ''మా చెల్లి నీకన్నా అందంగా వుంటుంది. ఆమె దేవత. ఆమె చెప్పింది కాబట్టే నేన్నిన్ను పెళ్లి చేసుకున్నానని'' మీరని అటు తిరిగి గుర్రుపెట్టి నిద్రపోతుంటే నవ్వాలో, ఏడ్వాలో తెలీక రాత్రంతా ఆలోచనలతో గడిపిన నా మనసుకు తెలుసు నేనెంత వేదనను అనుభవించానో. అసలు పెళ్లాన్ని చెల్లెలితో పోల్చుకునే మీ మనస్తత్వాన్ని ఏమనాలి? ఈ మాటలు మా తల్లిదండ్రులకు చెప్తే గొడవలు అవుతాయని సర్దుకున్నాను. తెలీక మాట్లాడారేమో క్రమంగా మీరే తెల్సుకుంటారని ఎదురుచూసాను.




కానీ రోజురోజుకూ మీ ప్రవర్తన నాలో ఎంత అసహ్యాన్ని నింపిందో నాకే తెల్సు. కనీసం నన్ను కన్న తల్లిదండ్రులకు కూడా చెప్పలేక ఎంత వేదనను అనుభవించానో ఒక్క నాకే తెల్సు. ఇవన్నీ చెప్తే నా కుటుంబ సభ్యులు మిమ్మల్నెక్కడ చులకనగా చూస్తారో అని ఎంత బాధపడ్డానో మీకెలా అర్థమవుతుంది? హృదయం స్థానంలో బండను ప్రతిష్ఠించాడు దేవుడు మీకు. అవును హృదయమున్న వారెవరూ భార్యతో ఇలా ప్రవర్తించరు. ఐ రియల్లీ మీనిట్.


పేరుకు కోటీశ్వరులైన మీరు పెళ్లయిన ఈ రెండు సంవత్సరాల్లో ఒకే ఒక్కసారి మూరెడు మల్లెపూలు తెచ్చి ఆ ఖర్చు మూడు రూపాయలు మీ రోజువారీ లెక్క పుస్తకాల్లో రాసుకున్నరోజు నా ప్రాణం ఎంత బిక్కచచ్చిపోయిందో నాకే తెల్సు.

ఆషాఢమాసంకు నా తమ్ముడొచ్చి పుట్టింటికి తీసుకు వెళ్తున్నరోజు ఐదుపైసలు చేతిలో పెట్టకుండా రైలెక్కించి దూరపుబంధువల్లే టాటా చెప్తున్న మిమ్మల్ని చూసి మనసులో ఎంత అసహ్యించుకున్నానో ఎంత నవ్వుకున్నానో ఒక్క నాకే తెల్సు.

ఏమండీ సిన్మాకెళ్దామండీ అంటే ''ఆ... ఏం సిన్మాలే. మీ ఊరెళ్లి మీ చెల్లి తమ్ముడితో చూడు అనేవారు కనీసం నా ఫీలింగ్స్ కూడా పట్టించుకోకుండా. ఇక్కడ సిన్మాకెళ్లడం, పార్క్‌కు వెళ్లడం కాదు ముఖ్యం. మీతో చూడ్డం, మీతో వెళ్లడం నాకు ముఖ్యం. ఇలాంటి చిన్న చిన్న సున్నితభావాలు నీలాంటి బండ మనస్సుకు ఏం అర్థమవుతాయి?

మగ గొంతు వేసుకుని, కూర్చున్న కుర్చీలోంచి కదలకుండా అందరికీ ఆజ్ఞలు జారీచేసే మీ ముద్దుల చెల్లెల్ని, ఆడగొంతుతో అమ్మాయిలా అతి మెల్లగా మాట్లాడే మిమ్మల్ని చూసి ఎన్ని వేలసార్లు అనిపించిందో 'ఆడపిల్లని మగాడిలా, మగపిల్లవాడిని ఆడదానిలా' పెంచిన మీ తల్లిదండ్రుల పెంపకానికి జోహారులర్పించాలని.

యజమాని ముందు తోకాడించే అల్సేషన్ పెంపుడు కుక్కలా చేతులు కట్టుకు మాట్లాడే ఆమె అమాయకపు అతి తెలివి భర్తను తలుచుకుంటే ఎంత జాలివేసేదో ''నీవు కోడలిగా వచ్చి బాధలు పడుతున్నావు. నేను అల్లుడిగా వచ్చి బాధలు పడ్తున్నాను'' అంటూ నా దగ్గర ఆడదానిలా ఏడ్చే ఆ మగాడిని తల్చుకుంటే జాలి వేయక ఏం వేస్తుంది? తన అత్తమామల్ని పేడపురుగులు కంటే హీనంగా చూసే మీ ముద్దుల చెల్లెలికి మీ అమ్మానాన్నల తానతందానాలు చూస్తే మరీ ఆశ్చర్యమేసేది. వాళ్ల కూతురైతే అలా వుండాలిట. కోడల్నయినా నేనైతే అచ్చు పాత సిన్మాల్లో కోడలల్లే మసలుకోవాలిట. వారి కోర్కెలకు అనుగుణంగానే ఆదర్శ కోడలల్లే అన్నీ భరించాను. వారు చెప్పే నీతులన్నీ పాటించాను. చదువుకున్నదాన్నన్న సంగతే మర్చిపోయాను. నా చదువు, నా విజ్ఞానం అన్నిటికీ తిలోదకాలిచ్చాను. ఎందుకు... మీకోసం!



## తోడు..

**నవరస నటుడు నానా పటేకర్ ఈ మధ్య ముంబాయిలో జరిగిన ఓ కాలేజీ ఫంక్షన్‌కు అతిథిగా ఆహ్వానించబడ్డాడు. తనతోపాటు తన ప్రియురాలు మనీషాను కూడా వెంట తీసుకెళ్లి అక్కడి వాళ్లను ఆశ్చర్య చకితుల్ని చేశాడట నానా.. అంతే కాదు..తాను ఈ నేపాలీ సుందరికి మరాఠీ నేర్పించానని.. ఇప్పుడు మనీషా ఎంతబాగా మరాఠీ మాట్లాడుతుందో మీరే చూడండి..అన్నాడట. మనీషా లేచి మరాఠీలో ''ఐలవ్‌యూ'' అన్నదట..! ఎవరినో అర్థం కాక తికమక పడ్డారుట అక్కడి విద్యార్థులు..!**

**-కృష్ణాజీ**

కానీ ఆ పెద్దమనుషుల ముసుగుల్లో వున్న అతి చిన్న మనస్సులున్న ఆ ఇరుకు మనస్తత్వాల మనుషులు కనీసం నన్ను మీతో మాట్లాడనిచ్చేవారా? వారసలు మనుషులేనా? మనుషులు ఇలాక్కూడా వుండగలరని నిరూపించారు.

మీనుండి నేకోరుకుంది కోట్ల ఆస్తులుకాదు, ఎస్టేట్, కార్లు కాదు, మేడ తిరగని నగలూకాదు, పర్సునిండా డబ్బూ కాదండీ. కాస్తంత ప్రేమ, మరికాస్త ఆదరణ, గుప్పెడంత మనస్సు, ఇవేవీ లేవు సరికదా మీ అనుమానపు మాటలు, చేతలు వీటితో నన్నెంత బాధపెట్టారో మీకెలా తెల్సు. భార్యని బాధపెట్టడంలో ఎక్కడైనా ట్రైనింగ్ అయి వచ్చారేమో అని ఒక్కోసారి నాకు డౌట్ వచ్చేది.

ఆఫీసు నుండి రాగానే కనీసం పలకరించకుండా వంటింట్లో బల్లమీద అమ్మనొక పక్కన చెల్లినొక పక్కన కూర్చోపెట్టుకుని మీరు ఊర్లోని పాచిగోలు కబుర్లన్నీ ఓపిగ్గా, ఆనందంగా డిస్కస్ చేస్తుంటారే, భార్యతో మనసు విప్పి ఐదుసెకన్లు మాట్లాడాలనే ఇంగితజ్ఞానం మీకులేదా? కోరికోరి మా ఇంటి చుట్టూ తిరిగి తిరిగి నన్నెందుకు చేసుకున్నట్లు? నా తల్లిదండ్రులు నాతో పంపే ఆ లక్షల లక్షల డబ్బు కోసమేకదూ? నేనెంత పిచ్చిదాన్ని. అదంతా నామీద మీకున్న ప్రేమే అని పెళ్లిముందు ఎంత మురిసిపోయాను.


పన్లో పనిగా వంటింట్లో బల్లమీద కూర్చుని అమ్మా చెల్లి చెప్పే చాడీలు విని రయ్యిన రూమ్‌లోకొచ్చి మీరు మాట్లాడే ఆడంగి మాటలకు ఎంత అసహ్యించుకునేదాన్నో మీకెలా తెల్సు. స్వంతంగా మాట్లాడ్డమే మీకు రాదు. అవును ఎలా వస్తుంది? అంతా తల్లి పెంపకలోపం. అమ్మాయి తల్లి చేతికింద అబ్బాయి తండ్రి చేతికింద పెరగాలిట. కానీ మీ ఇంట్లో కేస్ అంతా రివర్సేకదా మరి.

ఎవరైనా గెస్టులు మనింటికొచ్చి వెళ్తే వాళ్లు మనకేం తెచ్చారో అనే మీ ఆరాలు, వాళ్లు మనింట్లో ఎంత క్వాంటిటీ తిని వెళ్లారో అనే మీ లెక్కలు, ఒకరిళ్లకు మనం వెళ్తే వాళ్లు మనకేం పెట్టారో అనే మీ కక్కుర్తి బేరీజులకు నా తలెంత తిరిగేదో మీకెలా తెల్సు. మీ లెక్కల చూపులకు భయపడి కనీసం మీ ఇంట్లో కడుపునిండా అన్నం తినలేదంటే నమ్మగలరా మీరు? హు... భార్య గురించి పట్టించుకునేంత తీరిక, ఓపికా మీకెక్కడివి?

మనిషికి కావాల్సింది డబ్బుతోవచ్చే ఈ తాత్కాలిక సుఖాలు కాదండీ. మంచి మనస్సు, ప్రేమ, ఆప్యాయత, ఆదరణ... మీరు మార్తారని ఎంతో ఎదురుచూసాను. కానీ మీ అనుమానపు ధృక్కులకు భయపడిపోయాను. మీ తల్లి, చెల్లి

మాటలకు బిక్కచచ్చిపోయాను.

అసలు మీ కుటుంబం ఎవర్నైనా నమ్ముతుందా? మీరు ఎవ్వర్నీ నమ్మరేమో? తమమీద తమకు నమ్మకం వున్న వారెవరూ ఎదుటివార్ని అనుమానించరు. మీ ఇంట్లో అందరికీ ఏదో ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ వుంది. ఇన్‌ఫాక్ట్ సమ్ సైకలాజికల్ డిసార్డర్స్ కూడా వున్నాయనుకుంటా. అందుకే ఎవర్నీ నమ్మరు. అందర్నీ అనుమానించి అవమానిస్తారు. ఎదుటివార్ని ఏడ్పించి ఆనందపడ్తారు. ఎదుటివార్ని మనసు గాయపెట్టేంత హేళన చేసి మహదానందం పొందుతుంటారు.




మీలో మార్పుకోసం నేనెంతో ప్రయత్నించాను. పుట్టింటి నుండి తిరిగొచ్చిన నన్ను స్టేషన్‌లోనే పట్టుకుని మీ అమ్మావాళ్ళు ఎంతిచ్చారు? ఏమిచ్చారు? అంటూ నా డబ్బులతోనే బాంక్ అకౌంట్ తీసిచ్చి ఆ డబ్బంతా దాన్లోనే వేసుకోమనే మీ నీచ మనస్తత్వంలో ఇక మార్పురాదని డిసైడ్ అయ్యాను. మీలో మార్పుకోసం నేచేసే ప్రతి ప్రయత్నానికి ఎదురైన అవమానాలు, అవహేళనలు చాలక మీతోపాటు ఆ ఇంట్లోనే వుంటే అతి త్వరలో నేనూ ఓ మెంటల్ పేషెంట్‌నయ్యే ప్రమాదం వుంది.

కనీసం భర్తని కాలు క్రింద చెప్పులా తొక్కిపట్టే మీ అమ్మ మనస్తత్వం నాకివ్వనందుకు ఆ దేవుడిని తిట్టని క్షణంలేదు. చదువుకున్నవాళ్ళకన్నా ఏమీ చదవని మీ అమ్మ చాలా గొప్పదా? ఆమె కాలి కింద చెప్పులా బ్రతికే మీ నాన్న గొప్పవాడా? భర్తని కుక్కకంటే హీనంగా చూస్తూ అణగదొక్కిన మీ చెల్లి గొప్పదా?

పుట్టింటి నుండి ఇంకా డబ్బు తెమ్మంటూ అది తెమ్మంటూ ఇది తెమ్మంటూ నన్ను వేధిస్తూ లేకపోతే విడాకులిస్తానంటూ బెదిరిస్తుంటే అంత పని చెయ్యవద్దని మీ కాళ్ళు పట్టుకున ఏడ్చే నన్ను చూసి మీరు, మీ అమ్మ, నాన్న, చెల్లి వికటంగా శాడిస్టిక్‌గా నవ్వేవారుకదూ. ఆ నవ్వులకిక ఫుల్‌స్టాప్ పెట్టుకోండి. నేనే అవును నేనే నోరెత్తకుండా మాట్లాడ్డమే మర్చిపోయి అమాయకంగా మీరేం చెప్తే అది చేస్తూ వచ్చిన నేనే మీరు తేరుకోలేని దెబ్బ కొడ్తున్నాను. ఈ ఇంట్లో నుండి శాశ్వతంగా కాదు సుమీ. ఎక్కువగా ఆనందపడకు. పూర్తిగా చదువు. నాకవసరమైన బట్టలు మాత్రమే సూట్‌కేసులో సర్దుకున్నాను. మా పుట్టింటివారిచ్చిన నగలు, డబ్బు అన్నీ...అన్నీ నీ ముఖాన్నే కొడ్తున్నాను. అవి చూసి నువ్వు నీ కుటుంబ సభ్యులు ఆనందించండి. నాకు తెల్సు ప్రపంచంలో మీకెక్కువ ఆనందం కలిగించేది డబ్బే. హమ్మయ్యా దాని పీడ విరగడయ్యింది అని ఆనందిస్తావేమో. మరొకరిని పెళ్ళి చేసుకుని మరింత కట్నం పుచ్చుకోవచ్చునని ఆనందపడ్తున్నావేమో. అవేమీ చెల్లవు శ్రీవారూ. నేను మీకు విడాకులివ్వలేదు కదూ. ఇవ్వను కూడా. మీరు చేసే అలాంటి ప్రయత్నాలన్నింటికీ అడ్డు నిలుస్తాను. నీకిక పెళ్ళే కానివ్వను. లా ప్రకారం నేబ్రతికుండగా మీకు మరో పెళ్ళి చేసుకునే అధికారమేలేదు. నా ఒక్కో వస్తువును చూసినప్పుడల్లా నన్ను గుర్తుకు తెచ్చుకుంటూ మనకు పుట్టిన బాబుని చూసినప్పుడల్లా నన్నే గుర్తుకు తెచ్చుకుంటూ క్షణక్షణం చస్తూ బ్రతుకు. నాకు తెల్సు. నా పంతానికి ఆ పసివాడ్ని బలి చేస్తున్నాను. మీ పెంపకంలో వాడెలా పెరుగుతాడా అనే అనుమానం కూడా వుంది. కానీ తప్పదు. నీ మీద నా కసి తీరాలంటే ఇంతకంటే మరీ మార్గంలేదు. తల్లిగా వాడికి అన్యాయమే చేస్తున్నాను. వాడు నన్ను క్షమించడు. నాకు తెల్సు. నాకింతకంటే మార్గం తోచలేదు.

నాకోసం వెతక్కు. నీడలా నిన్ను వెన్నంటే వుంటాను. నువ్వేసే ప్రతి అడుగు గమనిస్తూనే వుంటాను. అవసరమైనప్పుడు నీముందుకొస్తాను.

మీ తల్లి చెల్లి మాటలు విని ఎప్పుడూ బెదిరిస్తూ వుండేవాడివిగా 'నిన్నొదిలేస్తా నిన్నొదిలేస్తా' అంటూ. నువ్వొదిలేసేదేంటి... ఇప్పుడు నేనే నిన్నొదిలేస్తున్నా. ఎలా వుందీ రిటార్ట్ తట్టుకోలేకపోతున్నావా? బంధువుల ఛీత్కారాలు, ఇళ్ళ పక్కవారి గుసగుసలు, శత్రువుల హేళనలు, స్నేహితుల పరామర్శలు, అవహేళనల మధ్య మీ కుటుంబమంతా క్షణక్షణం చిత్రవధ అనుభవించండిక. భర్త భార్యను వదిలేశాడనేకంటే భార్య భర్తను వదిలేసింది అనేది ఎక్కువగా అసహ్యకరమైనది. కాదంటారా శ్రీవారూ?

నీవనుకున్నట్లు నేనింకెవర్తోనో వెళ్ళిపోయేంత దిగజారలేదు. నాకు తెల్సు మీ కుటుంబం అంతకంటే పైమెట్టుపై నిలబడి ఆలోచించలేదని. ఆ మూడు నిముషాల సుఖంకోసం వేరెవర్తినో వెళ్ళేంత హీన మనస్తత్వం కాదు. మనసా వాచా నేన్నిన్నే ప్రేమించాను. నా హృదయంలో వేరెవరికీ చోటులేదు. వుండదు కూడా. కానీ నేన్నిన్ను ప్రేమించినంతగా నువ్వు నన్ను ప్రేమించావా? నిజం చెప్పు?

ఒంటరిగా నా బ్రతుకు నే బ్రతికేనంత చదువు నా తల్లిదండ్రులు చదివించారు. జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కోగలననే నమ్మకం నాకుంది. నన్ను నేను రక్షించుకోగల ఆత్మవిశ్వాసం వుంది.

ఫెమినిజం కోసం నేపోరాడలేదు. కానీ నీ ప్రేమకోసం ఎదురు చూసీ చూసీ అలసిపోయాను. విసిగి వేసారిపోయాను. అందుకే వెళ్ళిపోతున్నాను.

కనీసం ఇప్పటికైనా మగాడిలా బ్రతకడం నేర్చుకో. ఆ అందమైన శరీరంలో వున్న అతి అసహ్యకరమైన నీ మనస్సుని వికసింపజేసుకో. సక్రమంగా ఆలోచించడం నేర్చుకో. ఎదుటి మనిషిపై విశ్వాసాన్ని పెంచుకో. స్వంతంగా ఆలోచించడం నేర్చుకో. పేరాసైట్‌లా ఇంకొకరిపై ఆధారపడి బ్రతక్కుండా నీకోసం నువ్వు బ్రతకడం నేర్చుకో. అన్నిటికంటే ముఖ్యంగా ఒక మనిషిలా బ్రతకడం నేర్చుకో.

డామ్‌దిస్ సమాజపు కట్టుబాట్లు. నేను మానసికంగా నలిగి వుక్కిరిబిక్కిరైననాడు నన్నెవ్వరూ రక్షించలేదు. సమాజం గురించి నాకు చింతేలేదు. నేను నవ్వితే అది ఏడుస్తుంది. నేను ఏడిస్తే అది నవ్వుతుంది. నామీద నాకు విశ్వాసమున్నప్పుడు నన్నెవ్వరూ ఏమీ చెయ్యలేరనే నమ్మకం నాకుంది.

నేచేసేది తప్పో ఒప్పో నాకు తెలీదు. కానీ నిన్ను దెబ్బ కొట్టడానికి ఇంతకంటే సరైన మార్గం నాకు తోచలేదు. నీకిదే సరైన శిక్షని నా నమ్మకం. క్షణక్షణం చస్తూ బ్రతుకు. నే చూస్తూనే వుంటాగా!

నీ బండ హృదయానికి

**బలైన నీ ఒకప్పటి**

**నిర్భాగ్యపు భార్య**

★



## సెక్స్ పవిత్రత..!

**ఎక్స్‌పోజింగ్‌లో, సెక్స్ పోజింగ్‌లో రివార్డులందుకున్న మమతా కులకర్ణి ఈ మధ్య సెక్స్ పవిత్రత గురించి తెగ ప్రచారం చేస్తోంది. ఇటీవల 'ఎయిడ్స్' ప్రమాదం గురించి హెచ్చరించడానికి ముంబాయిలో జరిగిన ర్యాలీ లో మమత పాల్గొని..'సెక్స్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోక పోతే ఎయిడ్స్ వస్తాయి..! ఇహనైనా కళ్ళు తెరవండి.. సెక్స్ పవిత్రతను గుర్తించండి..' అంటూ ఉపన్యాసాలు చేసింది..!**

**-కృష్ణాజీ**